సాక్షి అనకాపల్లి

సోమవారం । 6 । జనవరి । 2025



కమ్మేసిన మంచు 8లో

ఏజెన్సీని తలపించేలా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



తింటే 'తేగ'నచ్చేస్తుందిలే..

ప్రస్తుతం తేగలు విరివిగా లభిస్తున్నాయి. వీటిని ఒక సారి తింటే మళ్లీ మళ్లీ తినాలని కోరుకుంటారు. 8లో



ఆకాశమే హద్దురా.. 8లో

శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి పెరగడంతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం కళకళలాడుతోంది.

న్యూస్‌రీల్

7న అనకాపల్లిలో జాబ్‌మేళా

తుమ్మపాల: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 7నజాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్,డిగ్రీ విద్యార్హత కలిగిన 20 నుంచి 26 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిఫరెన్స్ సంఖ్యతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో జాబ్‌మేళాకు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, మరింత సమాచారం కోసం 8143229228 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రధాని పర్యటన విజయవంతానికి కమిటీలు

మహారాణిపేట(విశాఖ): ఈనెల 8వ తేదీన ప్రధాని విశాఖ పర్యటన విజయవంతానికి కమిటీలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి నారా లోకేష్ అన్నారు. రోడ్‌షో బాధ్యతను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు, బహిరంగ సభ నిర్వహణ బాధ్యతను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చూసుకుంటారని పేర్కొన్నారు. వారికి అంతా సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు.కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి ఇక్కడ ఏర్పాట్లపై వివరించారు. అన్ని రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించామని, వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్‌తోపాటు ప్రజల వాహనాలకు 26 ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. పాసుల జారీకి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు, మంత్రులు వంగలపూడి అనిత, బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, విప్ గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పరిశీలించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సభా ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

ఆర్గానిక్ బెల్లం.. హాట్‌కేక్‌లా

అనకాపల్లి సేంద్రియ బెల్లానికి దేశ విదేశాల్లో భలే గిరాకీ

- యూఎస్, ఆఫ్రికా, యూరప్ దేశాల నుంచి ఆర్డర్లు
- ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా మార్క్‌తో ఉత్పత్తుల ఎగుమతులు
- నాణ్యత, అత్యున్నత ప్రమాణాలకు పెద్దపీట
- ఏటా 25 వేల టన్నుల ఉత్పత్తి
- చెరకు రైతుకూ ఎక్కువ ధర ఇస్తున్న తయారీదారులు



ఈయన కోటవురట్ల మండలం రాజుపేట గ్రామానికి చెందిన వేగి శ్రీనివాసరావు. వారసత్వంగా సేంద్రియ బెల్లం తయారు చేస్తున్నారు. ఇందుకోసం మాకవరపాలెం మండలం జంగాలపాలెంలో తండ్రి పేరిట రూ. 2.5 కోట్లతో ఆగ్రోస్ యూనిట్ ఏర్పాటుచేశారు. అత్యాధునిక యంత్రాలతో, 40 మంది నిపుణులైన ఉద్యోగులతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆర్గానిక్ బెల్లాన్ని తయారు చేసి, విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఐఎస్‌వో 22000, ఐఎస్‌వో 1001 పత్రాలను పొందారు. ప్రస్తుతం అమెరికా, ఇతర దేశాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. ఏదాదికి 15 వేల టన్నుల చెరకు క్రషింగ్‌తో బెల్లం తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. రైతుల నుంచి 1,500 టన్నుల వరకూ..ఒక్కో టన్ను రూ.2,600 నుంచి రూ.3 వేల ధరతో కొనుగోలు చేస్తున్నారు. బెల్లం పొడర్, 10, 20, 850 గ్రాముల దిమ్మలు ఎగుమతి చేస్తున్నారు. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో యూనిట్ కోసం దరఖాస్తు చేశారు. బెల్లం సరఫరాకు గానూ ఘనా నుంచి టెండర్ సర్టిఫికెట్ కూడా వచ్చింది.



వీరిద్దరే కాదు సుమారు 50 మంది వరకూ ఆర్గానిక్ బెల్లం, ఆధారిత ఉత్పత్తుల తయారీ, విక్రయాల ద్వారా లాభాలు పొందుతున్నారు. వీటికి మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది.



ఈమె సుజాత. 'క్యూ వన్ ఇంటర్నేషనల్ ఆగ్రో ఫుడ్స్' పేరిట కుటీర పరిశ్రమను ఏర్పాటుచేసి.. 'అనకాపల్లి బెల్లం రుచులు' పేరుతో 40 రకాల సేంద్రియ బెల్లం ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పౌష్టికాహారమైన పప్పుండలు, కొబ్బరి ఉండలు, అరిసెలు, చిమ్మిలి, పాకుండలు, మినప సున్నుండలు, అవిశ లడ్డూలను ఎగుమతి చేస్తున్నారు. రూ.10 వేల పెట్టుబడితో ఆర్గానిక్ బెల్లం ఉత్పత్తులను ప్రారంభించారు. మొదట్లో నష్టాలు వచ్చినా..వెనక్కి తగ్గలేదు. తరువాత మాల్స్, ఆర్గానిక్ స్టోర్స్ నుంచి ఆర్డర్లు పెరిగాయి. గత ఏడాది వరల్డ్ ఫుడ్ ఫెస్టివల్‌లో 'అనకాపల్లి బెల్లం రుచులు' పేరిట ఏర్పాటు చేసిన ఉత్పత్తులకు విశేష ఆదరణ లభించింది. అప్పుడే జపాన్, కెన్యా దేశాల వారితో ఒప్పందం చేసుకున్నారు. సింగపూర్, దుబాయ్, కెన్యా,మెల్‌బోర్న్, జపాన్ నుంచి ఆర్డర్లు పెరిగాయి. ఇటీవల విదేశాలకు హిమోగ్లోబిన్ లడ్డు, అరిసెలు, బూడిద గుమ్మడికాయ హల్వా తదితర వాటిని ఎగుమతి చేస్తున్నారు.



టోక్యో వ్యాపారులతో ఒప్పందం చేసుకుంటున్న సుజాత

జిల్లాలో సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసే బెల్లం, ఇతర ఉత్పత్తులకు అంతర్జాతీయంగా గిరాకీ పెరిగింది. నాణ్యమైన పద్ధతుల్లో తయారీ చేసే బెల్లం దేశవిదేశాల్లో ఆధరణ చూరగొంటోంది. విదేశాల నుంచి ఆర్డర్లు పెరుగుతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా,జపాన్, కెన్యా, మారిషస్, యూరప్ తో పాటు మన దేశంలో రాజస్థాన్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. దీంతో రోజురోజుకూ ఈ బెల్లం తయారీపై రైతులు, వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు.

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో తయారవుతున్న ఆర్గానిక్ బెల్లానికి మంచి గిరాకీ ఉంది. ఆర్గానిక్ బెల్లం, బెల్లం ఆధారిత ఉత్పత్తులు హాట్‌కేక్‌ల్లా అమ్ముడవుతూ లాభాలు కురిపిస్తున్నాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వలే ఆధునిక పద్ధతుల్లో బెల్లం తయారు చేసే యూనిట్లను జిల్లాలో ఏర్పాటుచేశారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పోటీ పడుతూ.. అనకాపల్లి పరిశోధన కేంద్రంలో విలువ ఆధారిత బెల్లం తయారీ చేస్తున్నారు. దీంతో అనకాపల్లి ఆర్గానిక్ బెల్లానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దీంతో హాట్‌కేక్‌లా అమ్ముడవుతోంది.

అనకాపల్లి జిల్లా నుంచి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా మార్క్‌తో సేంద్రియ బెల్లం, బెల్లంతో తయారయ్యే ఉత్పత్తులను ఎగుమతులు చేస్తున్నారు. ఏటా జిల్లా నుంచి సుమారు 25 వేల టన్నుల సేంద్రియ బెల్లం, 30కి పైగా సేంద్రియ బెల్లం ఆధారిత ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఆర్గానిక్ బెల్లం, బెల్లం ఉత్పత్తులపై ఆధారపడి జీవించే కుటుంబాలు 100కి పైగా ఉన్నాయి. అనకాపల్లి, మునగపాక, మాడుగుల, కోటవురట్ల మండలాల్లో ఆర్గానిక్ బెల్లాన్ని అధికంగా తయారుచేస్తున్నారు. చక్కెర కర్మాగారాలు గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితుల్లో చెరకు రైతులకు అండగా ఆర్గానిక్ బెల్లం తయారీ సంస్థలు నిలుస్తూ మంచి గిట్టుబాటు రేటు అందజేస్తున్నాయి.



బిల్లెట్స్, సేంద్రియ బెల్లం కలిపి..



ఎగుమతి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులు

హైడ్రోస్ కలపకుండా..

బెల్లం తయారీలో సహజంగా సల్ఫర్, హైడ్రోస్ వినియోగిస్తారు. కానీ సేంద్రియ బెల్లం తయారీలో వాటిని వినియోగించకుండా సుక్రోజ్, విటమిన్ 'ఎ', విటమిన్ 'సి'లను తగుమోదతాదులో కలిపి తయారు చేస్తున్నారు. పంచదారతో సంబంధం లేకుండా, హైడ్రోస్, రంగు కలపకుండా బెల్లం తయారు చేస్తారు. ఆధునిక పద్ధతుల్లో తయారు చేసే బెల్లం తయారీ యూనిట్లను జిల్లాలో ఏర్పాటు చేశారు. విటమిన్లు, ఫ్లేవర్లు జత చేసి నాణ్యత, అత్యున్నత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తయారీ చేస్తున్నారు. అందుకే అనకాపల్లి ఆర్గానిక్ బెల్లానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు లభించాయి.

5 గ్రాముల నుంచి...

జిల్లాలో పలువురు సంప్రదాయ పద్ధతిలో బెల్లం తయారీ యూనిట్లను ఏర్పాటుచేశారు. 5 గ్రాముల నుంచి 850 గ్రాముల బరువు గల బెల్లం దిమ్మలు, కుందులు, పౌడర్, బెల్లం ద్రావణాన్ని తయారు చేస్తున్నారు. మన దేశం నుంచి ప్రపంచ దేశాలకు 8 మిలియన్ల టన్నుల బెల్లం ఎగుమతులకు అవసరం కాగా.. ఆరు మిలియన్ టన్నుల బెల్లాన్ని ఎగుమతి చేస్తున్నారు. దీంతో బెల్లం ఎగుమతులపై సేంద్రియ బెల్లం తయారీ దారులు దృష్టి పెట్టారు. విదేశీయులు ఇష్టపడే ఫ్లేవర్లలో బెల్లం తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు.



సేంద్రియ బెల్లం దిమ్మలు



బెల్లం తయారు చేస్తున్న కార్మికుడు



సేంద్రియ బెల్లం, బెల్లం పొడి

ఘనంగా దేవానంద స్వామీజీ ఆరాధనోత్సవాలు

దేవరాపల్లి: సద్గురు దేవానంద సరస్వతి స్వామీజీ మహరాజ్(రిషీకేష్) 25వ ఆరాధన మహోత్సవాలు కొత్తపెంటలోని ఆశ్రమంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7న ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వేడుకలను నిర్వహించనున్నారు. తొలి రోజు ఆదివారం రిషీకేష్ నుంచి వచ్చిన పద్మనాభానంద స్వామీజీతో పాటు పలువురు సాధు సంతులు దేవానంద స్వామిజీ విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.రాత్రి భజన కార్యక్రమాలను, భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఆఖరి రోజు ఈ ఆరాధన మహోత్సవానికి దేశ వ్యాప్తంగా స్వామీజీ భక్తులు, శిష్యులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, దేవానంద స్వామి ఆధ్యాత్మిక జీవన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



దేవానంద స్వామీజీని దర్శించుకుంటున్న పద్మనాభానంద స్వామీజి, సాధు సంతులు

మాట తప్పారు.. మోసం చేశారు..

- ప్యాకేజీ చెల్లించకుండా శంకుస్థాపన ఎలా చేస్తారు
- అఖిల పక్షనేతల ఆగ్రహం
- బహిరంగ సభ ప్రాంతంలో ఆందోళన

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి రైతులకు నష్టపరిహారం, ప్రత్యేక ప్యాకేజీ చెల్లించకుండా ప్రధాని మోదీతో ఎలా శంకుస్థాపన చేయిస్తారని పలువురు అఖిలపక్ష నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని శంకుస్థాపన కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించేందుకు రాజయ్యపేటలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణం వద్ద ఆదివారం వారు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ,సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట తప్పిందన్నారు. 2014 భూసేకరణ సమయంలో 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ప్యాకేజీ చెల్లిస్తామని మాట ఇవ్వడంతో రైతులంతా నమ్మి కోర్టు కేసులు ఉపసంహరించుకుని భూములు ఇచ్చారని చెప్పారు. ఆ సమయంలో కేవలం భూములకు నష్టపరిహారం చెల్లించారన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం చెట్లకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిరాయితీ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి నష్టపరిహారం,నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు రూ.25 లక్షల ప్రత్యేక ప్యాకేజీ, ఐదు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు అందజేయాల్సి ఉందన్నారు. భూములుసేకరించడం వల్ల ఉపాధి కోల్పోతున్న కల్లుగీత కార్మికులు, క్షురకులు, మత్స్యకారులు, గుల్లకార్మికులు, దళితులు, వ్యవసాయ కూలీలకు కూడా ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ కోసం కటాఫ్ తేదీని నష్టపరిహారం చెల్లించిన 2016 సంవత్సరాన్ని పరిగణలోకి తీసుకోవాలని, ఇదే సంవత్సరంలో మేజర్లయిన వారికి ఈ ప్యాకేజీ చెల్లించాలన్నారు. తమ డిమాండ్లు, సమస్యలు పరిష్కరించిన తర్వాతే పనులు ప్రారంభించాలని పలు పర్యాయాలు కలెక్టర్, ఏపీఐఐసీ అధికారులు, మంత్రులకు వినతి పత్రాలు అందజేసినట్టు చెప్పారు. ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ భూముల్లో కొబ్బరి తోటలను తొలగించడం, భూములను చదును చేయడం వంటి పనులు చేస్తోందని ఆరోపించారు. అడ్డుకునే రైతులను, నాయకులను గృహ నిర్బంధం చేస్తున్నారని చెప్పారు. శంకుస్థాపన చేసిన తర్వాత నైనా రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పనులు అడ్డుకుంటామని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ ఆందోళనలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ,ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, సర్పంచ్ తళ్ల భార్గవ్,వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభ ఏర్పాటు చేసే ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న అఖిల పక్ష నాయకులు

పల్లెల్లో అటుకుల సవ్వడి



మిషన్‌లో అటుకులు తయారవుతున్న దృశ్యం

కొత్తపంట చేతికి రావడంతో మిల్లుల వద్ద సందడి

స్నేహబంధానికి ప్రతీకగా అటుకులు

నక్కపల్లి: సంక్రాంతి పండక్కి వచ్చిన బంధువులను,స్నేహితులను ఉత్తిచేతులతో పంపకుండా కుంచాలకొద్ది అటుకులిచ్చి గౌరవంగా పంపడం అనాదిగా వస్తున్న మన ఆచారం. బడికి వెళ్లనని పిల్లాడు మారాం చేస్తే తల్లి బుజ్జగించి జేబులో కమ్మని అటుకులు, బెల్లం వేసి పంపే అలవాటు మనది. అటుకుల పేరు చెప్పగానే పురాణాల్లో స్నేహబంధం గుర్తుకు వస్తుంది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని మీద ప్రేమతో పేద స్నేహితుడైన కుచేలుడు అటుకులు బహుమానంగా ఇవ్వగా, శ్రీకృష్ణుడు ఆయనకు అష్ట ఐశ్వర్యాలు ప్రసాదిస్తాడు. రైతులు కొత్తగా పండిన ధాన్యాన్ని తొలివంటగా సంక్రాంతి పర్వదినాన శ్రీకృష్ణుడికి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీ. అవే ధాన్యాన్ని అటుకులుగా ఆడిస్తారు. అటుకులతో రకరకాల చిరుతిళ్లు తయారు చేస్తారు. అటుకులలో బెల్లం ముక్కలు, పాలు చక్కెర కలిపి తింటారు. పులిహోర తయారు చేస్తారు. ఈ ఏడాది వరి పంట బాగా పండింది. అడపా దడపా భారీ వర్షాలు కురిసినా, తుపాన్లు భయపెట్టినా రైతులకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కొన్ని చోట్ల కోతలు పూర్తయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వరికోతలు జరుగుతున్నాయి. కోతలు పూర్తిచేసి కుప్పలు వేసిన రైతులు పంట నూర్పులు పూర్తిచేశారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఈ ఏడాది 28వేల ఎకరాల్లో వరిసాగైంది. రైతుల ఇళ్లకు ధాన్యం రావడంతో అటుకుల మిల్లులు మళ్లీ తెరచుకున్నాయి. నిర్వాహకులకు పని లభించింది. పెట్టుబడులకు తగ్గట్టుగా 3 నెలలపాటు పనిచేసుకునే అవకాశం కలిగిందని మిల్లు యజమానులు చెబుతున్నారు. నక్కపల్లి, గొడిచర్ల,అడ్డురోడ్డు,పాయకరావుపేట,తుని తదితర ప్రాంతాల్లో సుమారు 15 వరకు అటుకుల మిల్లులు ఉన్నాయి.డిసెంబరు మొదలు మార్చి వరకు అటుకులు మిల్లుల వద్ద సందడి ఉంటుంది.




వేయించిన ధాన్యాన్ని మిల్లులో వేసి అటుకులుగా తయారు చేసిన దృశ్యం

తయారీ ఇలా..

డీజిల్‌తో ఈ మిల్లులు నడుస్తాయి. మట్టితో తయారు చేసిన పొయ్యిమీద 40కిలోల బరువుకలిగిన బీడు కళాయిలుఏర్పాటుచేసి ఇసుకలో ధాన్యాన్ని ఒక పర్యాయం వేయించిన తర్వాత మిల్లు ఆడితే అటుకులు తయారవుతాయి. ధాన్యాన్ని వేపడం కోసం ప్రత్యేకంగా జీడిపిక్కల ఫ్యాక్టరీల నుంచి మడ్డి తెస్తారు.జీడితొక్కనుంచి నూనె తీయగా వచ్చే నల్లటి మడ్డిపదార్థాన్ని వీరు పొయ్యిలలో వేసి మండిస్తారు. దీనిని బస్తా రూ.200లకు కొనుగోలు చేస్తారు. కృష్ణదేవి పేట నుంచి దీన్నికొని తెస్తారు. బస్తా మడ్డి 200కిలోల ధాన్యాన్ని వేపేందుకు సరిపోతుంది. మిల్లును డీజిల్ఇంజిన్‌సహాయంతో నడుపుతారు. ధాన్యంవేపేవారికికుంచానికి(4కిలోలకు)రూ.8, మిల్లు ఆడే వ్యక్తికి కుంచానికి రూ.5 చెల్లిస్తారు.20లీటర్ల డీజిల్‌తో 300కుంచాల(1200కిలోల) ధాన్యం అటుకులుగా ఆడొచ్చని నిర్వాహకులు తెలిపారు. ఇలా ధాన్యాన్ని అటుకులుగా ఆడినందుకు కుంచానికి రూ.30 వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సీజన్‌కావడంతో అటుకుల మిల్లులవద్ద సందడి కనిపిస్తోంది. గొడిచర్ల పాయకరావుపేట, శ్రీరాంపురం తదితర ప్రాంతాల్లో ఉన్న మిల్లులవద్ద చుట్టుపక్కలవారు అటుకులు ఆడించేందుకు రావడంతో నిర్వాహకులకు పనిబాగానే లభించింది. ఇలా కొత్త పంటతో ఆడించిన అటుకులను సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుళ్లు, బంధువులు, చుట్టుపక్కల స్నేహితులకు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకుంటారు.కొంతమంది వ్యాపారులు కొత్త ధాన్యాన్ని రైతులనుంచి కొనుగోలు చేసి అటుకులు తయారు చేయించి టోకుపద్ధతిన కిరాణాషాపుల్లోను సూపర్‌మార్కెట్లలో కిలో, 2 కిలోల ప్యాకెట్ల చొప్పున విక్రయిస్తారు. కిలో అటుకులు రకాన్ని బట్టి రూ.60నుంచి రూ.90ల వరకు విక్రయిస్తున్నారు.

అటుకులు పంచడం ఆనవాయితీ



కొత్త ధాన్యంతో ప్రతి ఏటా సంక్రాంతి ముందు అటుకులు ఆడిస్తాం. వరి కంకులను, ఆడించిన అటుకులను ముందుగా దేవుడికి నైవేద్యంగా సమర్పించి తర్వాత బంధువులకు స్నేహితులకు పంచిపెడతాం. ఇది తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఇలా పంచడం వల్ల పంట సమృద్ధిగాపండి రైతుల ఇళ్లల్లో పాడిపంటలకు లోటు ఉండదనేది రైతుల నమ్మకం.

– సురేష్‌రాజు, వేంపాడు



అటుకుల తయారీలో కార్మికుడు

చెరకు రైతుల బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: చెరకు రైతుల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించకపోతే ఉద్యమం తప్పదని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రషింగ్ సీజన్ నాటికి రైతులకు పూర్తిగా బకాయిలను చెల్లించినట్టు చెప్పారు.పేమెంట్స్ టన్నుకు రూ.350 చెల్లించవలసి ఉండగా కూటమి ప్రభుత్వం నేటికీ పూర్తిగా చెల్లించలేదని చెప్పారు. గేటు ఏరియాకి సరఫరా చేసిన రైతులకు అదనంగా టన్నుకి మరో రూ.50చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. చెరకు రైతులకు, కార్మికుల జీతభత్యాలకు సంబంధించి బకాయిలు రూ.16.66 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీలో గత ఏడాదికి సంబంధించిన మొలాసిస్, పంచదార, కరెంటు విక్రయించడంతో రూ.9కోట్లు రానున్నాయని, కేవలం రూ.6కోట్లు మాత్రమే ప్రభుత్వం గ్రాంట్‌గా ఇస్తే సరిపోతుందని ధర్మశ్రీ చెప్పారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.170 కోట్ల మేర రుణాలు చేసి అప్పుల ఊబిలోకి ఫ్యాక్టరీని తోసేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ఫ్యాక్టరీపై భారం పడకుండా వడ్డీ చెల్లిస్తూ రూ.130కోట్ల వరకూ పాత అప్పులు తీర్చామన్నారు. చెరకు రైతుల బకాయిలు, కార్మికుల జీతభత్యాలు చెల్లించేందుకు ఏటా రూ.8 కోట్ల నుంచి రూ.15కోట్లు వరకూ ఇచ్చామని, గోవాడ ఫ్యాక్టరీకి రూ.90 కోట్లు గ్రాంటుగా తెచ్చామని చెప్పారు. తమ పాలనలో ప్రతి ఏటా క్రషింగ్‌ను డిసెంబరు 15వతేదీ లోపులోనే ప్రారంభించేవారమని, కానీ ఈ ఏడాది జనవరినెల వచ్చినా పూర్తిస్థాయి క్రషింగ్ ప్రారంభించే పరిస్థితి కనిపించలేదన్నారు. ముందుగా క్రషింగ్ ప్రారంభిస్తే చలికి చెరకులో రస నాణ్యత బాగుండి మంచి దిగుబడి వస్తుందని దీనివల్ల రైతులకు, ఫ్యాక్టరీకి కూడా మేలు జరుగుతుందన్నారు.కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సాయం చేయకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఈ ఏడాది క్రషింగ్‌ను సకాలంలో ప్రారంభించలేకపోయినట్టు చెప్పారు. గత మహాజనసభలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటు కంటే ఒక్కరూపాయి అయినా అదనంగా తెస్తామని చెప్పిన చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి గ్రాంటుగా తేలేదన్నారు. పాత బకాయిలు పూర్తిగా చెల్లించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని ధర్మశ్రీ హెచ్చరించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి

- జనరల్ బాడీ ఏర్పాటు చేయాలి
- ఫ్యాక్టరీ ఆస్తులు కాజేయాలని చూస్తున్న ఎమ్మెల్యే కొణతాల
- మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరి పైడారావు విమర్శ


సమావేశంలో మాట్లాడుతున్న విల్లూరి పైడారావు

అనకాపల్లి : అధికారంలోకి వస్తే తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు ఇప్పుడు మీనమేషాలు లెక్కబెడుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరి పైడారావు అన్నారు. కనిశెట్టి సురేష్‌బాబు ఆధ్వక్షతన ఆదివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు ఫ్యాక్టరీ కాకుండా వేరే ఇతర కార్యక్రమాలు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఫ్యాక్టరీని ఆధునికీకరించి చెరకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ పరిధిలో 13 వేల మంది సభ్యులు ఉన్నారని, వారి అభిప్రాయం తీసుకోకుండా, షేర్ హోల్డర్లతో సమావేశం నిర్వహించకుండా, జనరల్ బాడీ లేకుండా, సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సుమారు రూ. 500 కోట్ల ఆస్తులు సుగర్ ఫ్యాక్టరీకి ఉన్నాయని, వాటిని కాజేయడానికి ఎమ్మెల్యే కుట్రలు పన్నుతున్నారని తీవ్రంగా ఆరోపించారు. జనరల్ బాడీ సమావేశం నిర్వహించి, ఫ్యాక్టరీని తెరిపించేందుకు కృషి చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు కర్రి అప్పారావు, కోరిబిల్లి శంకరరావు మాట్లాడుతూ చెరకు లేని కారణంగా వేరే పరిశ్రమలను ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆరుమాసాల్లో 2 లక్షల టన్నుల చెరకును అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలన్నారు. గతంలోనే ఈ ఫ్యాక్టరీలో డిస్టిలరీ, మెడిసిన్, ఫినాయిల్ వంటి ఉత్పత్తులతో విజయవంతంగా నడిచిందని అదే సామర్థ్యంతో ఫ్యాక్టరీని పునర్నిర్మించాలని కోరారు. సమితి కన్వీనర్ కనిశెటి సురేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో ఫ్యాక్టరీ లిక్విడేషన్‌కు జీవో విడుదల చేసిందన్నారు. జీవోలో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, అప్పుడు ఈ ప్రాంత రైతులతో పాటు టీడీపీ కూడా వ్యతిరేకించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ విధానాలనే అవలంభిస్తుందని అన్నారు.

అవహేళనగా మాట్లాడడం స్పీకర్‌కు తగదు


మాట్లాడుతున్న భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

నర్సీపట్నం : హత్యకు గురికాబడిన బాధిత కుటుంబాన్ని ఆదుకోకపోగా..అవహేళనగా మాట్లాడడం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు తగదని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. నర్సీపట్నంలో ఆదివారం జరిగిన బహుజనుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మీ నియోజకవర్గంలో బలహీనవర్గానికి చెందిన సర్వసిద్ధి నాగేశ్వరరావు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడని, బాధిత కుటుంబాన్ని ఆదుకోకపోగా అవమానకరంగా మాట్లాడడం ఎంత వరకు సబబు అని స్పీకర్‌ను ప్రశ్నించారు. హత్య చేసిన వ్యక్తులను కాపాడేందుకు ప్రయత్నించడం తగదన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. దాడులు, హత్యల నుంచి బహుజనులకు రక్షణ కల్పించాలన్నారు. బడుగు బలహీన వర్గాలకు భారత చైతన్య యువజన పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రామచంద్ర యాదవ్ రూ.లక్ష, నర్సీపట్నం, అనకాపల్లి యాదవ సంఘం తరుపున రూ.లక్షా 50 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సమావేశంలో యాదవ సంఘం ప్రతినిధులు ఒమ్మి నర్సింగరావు, దేవర అనుషా, నమ్మి అప్పలరాజు, శేఖర్, సుధాకర్ యాదవ్, యలమంచిలి రమణ, ఒమ్మి నూకరాజు, పల్లా వెంకట్రావు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి


సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. జలకాలాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంజాయ్ చేశారు. సహపంక్తి భోజనాలు చేసి ఆట పాటలతో గడిపారు. -నాతవరం

తింటే 'తేగ' నచ్చేస్తుందిలే..

- ఆరోగ్యకర ఆహారం
- పట్టణంలో జోరుగా విక్రయాలు
- తేగల విక్రయంతో పలువురికి ఉపాధి


కాల్చిన తేగలు

యలమంచిలి రూరల్:

ప్రస్తుత సీజన్‌లో తేగలు విరివిగా లభిస్తున్నాయి. తాటి టెంకల ద్వారా లభిస్తున్న ఈ తేగలను ఒకసారి తింటే ఆ రుచి నచ్చడంతో మళ్లీ మళ్లీ తినాలని కోరుకుంటారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఏటా నవంబర్ నుంచి జనవరి మధ్యలో దొరికే తాటితేగలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.ఇందులో శరీరానికి అవసరమైన పోషక విలువలు ఉండడంతో ఈ సీజన్‌లో తప్పకుండా తినాల్సిన సూపర్ ఫుడ్‌గా వీటిని చెప్తారు.యలమంచిలి మండలంలో లభించే తాటి తేగలకు రుచితో పాటు డిమాండ్ ఎక్కువ.పట్టణంలో పలుచోట్ల తేగల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ఉడికించిన,కాల్చిన తేగలతో పాటు పచ్చి తేగలను కట్టలుగా చేసి విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. ధర అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది తేగలను కొనుగోలు చేస్తున్నారు. తేగలు తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.

వర్షాకాలంలో పాతర

ప్రతి ఏటా తేగల తయారీకి అవసరమైన కసరత్తు వర్షాకాలంలో ప్రారంభమవుతుంది. మండలంలోని పెదపల్లి,పురుషోత్తపురం,కొత్తలి, రేగుపాలెం, పులపర్తి,పద్మనాభరాజుపేట,ములకలాపల్లి,ఏటికొప్పాక, పోతురెడ్డిపాలెం, రుక్మిణీపురం,కష్టాపురం, లక్కవరం,సోమన్నపాలెం, గొల్లలపాలెం, వెంకటాపురం, కొక్కిరాపల్లి,అగ్రహారం,షేకిల్లపాలెం,జంపపాలెం, సోమలింగపాలెం,తెరువుపల్లి, మన్యంపాలెం,కొత్తపాలెం,కొత్త ఎర్రవరం తదితర గ్రామాల్లో తాటి తేగల తయారీని రైతులు తమ పొలాల్లో చేపడతారు. జూన్,జులై నెలల్లో తాటి పండ్ల నుంచి టెంకలను సేకరించి ఇసుక,మట్టి నేలల్లో చిన్నపాటి గోతులు తీసి పాతర వేస్తుంటారు. పాతర వేసిన తర్వాత వర్షాలకు అవి సుమారు రెండున్నర నుంచి మూడు నెలల్లో టెంకల నుంచి మొలకలు వచ్చి తేగలుగా తయారవుతాయి. నాగుల చవితి నుంచి తేగలు తీయడం ప్రారంభిస్తారు.మెట్ట ప్రాంతంలో దొరికే తేగలు పొడిపొడిగా పిండిగా ఉంటాయి. వీటిని కొందరు పిండిగా చేసుకుని రొట్టెలు కూడా చేసుకుంటారు. సాధారణంగా తేగలు నేరుగా కాల్చుకుని తింటే బాగా రుచిగా ఉంటాయి.అయితే నేరుగా కాల్చడం వల్ల తేగలపై తొక్క నల్లగా మాడిపోయి ఉంటుంది. ఇది చూసేందుకు,తినేందుకు కొందరు పట్టణవాసులు ఇష్టపడరు.దీంతో రైతులు,వ్యాపారులు పాతర నుంచి తీసిన తేగలను కుండలో లేదా రేకు డబ్బాలో పెట్టి తంపట వేస్తారు.తేగలను వారం రోజుల వరకు నిల్వ చేయవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.యలమంచిలి పట్టణంలో ప్రధాన రహదారికిరువైపులా తాటి తేగల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.వైఎస్సార్ విగ్రహం,ఆర్టీసీ బస్ కాంప్లెక్స్,ఆంజనేయస్వామి ఆలయం,కొమ్మాయిగుండం చెరువు గట్టు పక్కన,టౌన్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం,దిమిలి రోడ్డు కూడలి,పాత ప్రభుత్వాస్పత్రి, తాపీమేస్త్రీల సంఘం ఆంజనేయ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో తేగలు విక్రయిస్తున్నారు.కొందరైతే ఉడకబెట్టిన కర్రపెండలం దుంపలు,తాటి తేగలను సైకిళ్లు, ద్విచక్రవాహనాలపై ప్రధాన రహదారిపై తిరుగుతూ అమ్ముతున్నారు.నాలుగు తాటి తేగలను కట్టగా చేసి రూ.20కు అమ్ముతున్నారు.రుచితో పాటు ధర అందుబాటులో ఉండటంతో పలువురు తేగలను కొనుగోలు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

చాలామంది మలబద్ధకం సమస్యతో బాధపడుతుంటారు.అలాంటివారికి తాటి తేగల్లో ఉండే ఫైబర్ గొప్పగా పనిచేస్తుంది.మన శరీరం జీర్ణించుకోలేని కార్బోహైడ్రేట్లు,రక్తంలోని కొలెస్ట్రాల్,గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో ఇవి సహాయపడతాయి.తేగల్లో విటమిన్-ఎ, విటమిన్-సి, బి1,బి2,బి3,ఐరన్ పుష్కలంగా ఉంటాయి.బరువు తగ్గాలనుకునే వారు తాటి తేగలను తింటే కడుపు నిండుగా ఉన్న భావన కలిగి ఎక్కువ తినాలనే కోరికను తగ్గిస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా వీటిని తినవచ్చు.బలమైన ఎముకలు,దంతాల కోసం అవసరమైన కాల్షియం తాటి తేగల్లో ఎక్కువగా ఉంటుంది.తేగలు తినడం వల్ల రక్త హీనతకు చెక్ పెట్టవచ్చు. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను,దాని పనితీరును మెరుగుపరుచుకోవచ్చు.తేగల్లో పీచు,పొటాషియం, ఒమేగా-3 పుష్కలంగా లభిస్తాయి.ఇవి పేగుల్లో మలినాలు చేరకుండా చూస్తాయి. టాక్సిన్లను తొలగిస్తాయి. అయితే వీటిని అతిగా తినడం కూడా మంచిది కాదని ఆయుర్వేదవైద్యులు చెబుతున్నారు.

తేగల విక్రయంతో ఉపాధి



పాతర వేసిన రైతుల నుంచి తేగలు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి వైఎస్సార్ విగ్రహం వద్ద విక్రయిస్తుంటాను.ప్రతి ఏటా ఈ సీజన్లో తాటి తేగల అమ్మకం ద్వారా ఉపాధి పొందుతున్నాను జనవరి వరకూ తేగలు అందుబాటులో ఉంటాయి.వీటిని విక్రయించడం ద్వారా రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకూ ఆదాయం వస్తోంది. - బంగారు నూకరత్నం,శేషుకొండ కాలనీ,యలమంచిలి

ఉత్పత్తి తగ్గిపోతోంది



రియల్ ఎస్టేట్ దెబ్బకు తాటి చెట్లను ఇష్టానుసారం నరికివేస్తున్నారు.గతంలో ఎక్కడపడితే అక్కడ తాటిచెట్లు విరివిగా ఉండేవి.రైతులు కూడా అప్పట్లో పొలం గట్లపై తాటి చెట్లను పెంచేవారు.తాటిచెట్ల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది.దీంతో తేగల ఉత్పత్తి బాగా తగ్గిపోతోంది.పాతర నుంచి తేగలు బయటకు తీయడానికి బాగా కష్టపడాలి.కల్తీలేని ఆహారం ప్రజలకు అమ్ముతున్నామన్న సంతృప్తి కలుగుతోంది. - కళింకోట దేముడు,పురుషోత్తపురం

తేగలంటే చాలా ఇష్టం



ఈ సీజన్‌లో మాత్రమే లభించే తాటి తేగలంటే చాలా ఇష్టం.కాల్చినా, ఉడకబెట్టినా రుచిగానే ఉంటాయి.ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని వైద్యులు సూచించడంతో మా కుటుంబమంతా తప్పకుండా తేగలు తింటాం. ధర కూడా తక్కువగానే ఉంది.తిన డానికి రుచిగా కూడా ఉంటున్నాయి.

- పట్నాల సన్యాసిరావు,బైక్ మెకానిక్,యలమంచిలి

క్రాస్‌కంట్రీ స్టేట్ చాంప్ విశాఖ


ఓవరాల్ చాంపియన్ సాధించిన విశాఖ అథ్లెట్లు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌ను విశాఖ జట్టు కైవసం చేసుకుంది. ప్రవల్లిక, మేరీగ్రేస్, వేదవ్యాస్ ఆయా కేటగిరిల్లో విజేతలుగా నిలిచి జట్టుకు చాంపియన్‌షిప్ అందించారు. విశాఖ జిల్లా అథ్లెట్లు మొత్తంగా 24 పాయింట్లతో చాంపియన్‌షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. అండర్ 16 బాలికల రెండు కిలోమీటర్ల పరుగులో బి.ప్రవల్లిక విజేతగా నిలవగా.. అండర్ 18 బాలికల నాలుగు కిలోమీటర్ల పరుగులో రాగిణి, వుమెన్-20 ఆరు కిలోమీటర్ల పరుగులో హాసిని తృతీయ స్థానాల్లో నిలిచారు. వుమెన్-10 కిలోమీటర్ల పరుగులో ఎల్.మేరీగ్రేస్ తొలి స్థానంలో నిలవగా దివ్యదుర్గ ద్వితీయ, జ్యోతిదుర్గా తృతీయ స్థానాల్లో నిలిచారు. మెన్-10 కిలోమీటర్ల పరుగులో ఎం.ఎస్.జె.వేదవ్యాస్ తొలి స్థానంలో నిలవగా రమేష్ తృతీయ స్థానంలో నిలిచాడు. అండర్-20 మెన్ ఎనిమిది కిలోమీటర్ల పరుగులో చిన్నా తృతీయ స్థానంలో నిలిచాడు. వీరందరిని జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

కమ్మేసిన మంచు


బుచ్చెయ్యపేట రోడ్డులో కమ్మేసిన పొగమంచు


పొగమంచులో పొలానికి వెళ్తున్న రైతు

గొలుగొండ/బుచ్చెయ్యపేట: ఏజెన్సీని తలపించేలా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తోంది. బుచ్చెయ్యపేట, గొలుగొండ మండలాల్లో రెండు రోజుల నుంచి మంచు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల వరకూ ఏమీ కనిపించని పరిస్థితి. ఆదివారం తెల్లవారు జామున వాహనచోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించవలసి వచ్చింది. చలి వణికిస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బుచ్చెయ్యపేట మండలంలో బుచ్చెయ్యపేట, వడ్డాది, రాజాం, సీతయ్యపేట, గున్నెంపూడి తదితర గ్రామాల్లో మంచు విపరీతంగా కురుస్తోంది. వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు.


గొలుగొండలో లైట్లు వేసుకుని వెళుతున్న వాహనం

బీచ్ హ్యాండ్ బాల్ పోటీల విజేత విశాఖ


విజేతలతో నిర్వాహకులు

అచ్యుతాపురం : రాష్ట్ర స్థాయి బీచ్ హ్యాండ్ బాల్ పోటీల విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బీచ్ హ్యాండ్ పోటీల్లో తొలి స్థానం విశాఖపట్నం, రెండో స్థానం కర్నూల్, మూడో స్థానం ప్రకాశం జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.13 జిల్లాలకు చెందిన 150 మంది పాల్గొన్న ఈ జట్లలో ప్రతిభ కనబరిచిన 16 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. కమిటీ పర్యవేక్షణ పూర్తి చేసిన తర్వాత సోమవారం ఉదయం తుది జట్టును ప్రకటించనున్నారు. కార్యక్రమాల్లో బీచ్ హ్యాండ్ బాల్ అసోషియేషన్ సీఈఓ గోపి, రామకాసు, ప్రవీణ్, చేపల వెంకటరమణ, మేరుగు బాపునాయుడు, జనపరెడ్డి శ్రీనివాసరావు, మోటూరు శ్రీవేణి పాల్గొన్నారు.

టీడీపీ సబ్బవరం మండలాధ్యక్షుడు మిడతాడ రాజీనామా

- పీఏసీఎస్ చైర్మన్ పదవి కాదనడంతో నిర్ణయం!
- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ తీరుపై నిరసన

పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ నిర్ణయాలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు బహిరంగంగానే అసంతృప్తి వెల్లగక్కుతున్నారు. ఆదివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ సమక్షంలో పార్టీ సబ్బవరం మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు పదవికి రాజీనామా చేశారు. త్వరలో ఏర్పాటు కానున్న పీఏసీఎస్ చైర్మన్ పదవికి తన పేరు ప్రతిపాదించలేదన్న కారణంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. సబ్బవరం పీఏసీఎస్ చైర్మన్ పదవిని మిడతాడ ఆశించారు. అయితే బండారు వర్గీయుడు అయిన మహాలక్ష్మి నాయుడుకి చుక్కెదురైంది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తుంది. పార్టీ మండలాధ్యక్ష పదవికి రాజీనామా చేసినా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీలో కొనసాగుతానని ఈ సందర్భంగా మహాలక్ష్మినాయుడు పేర్కొన్నారు.

ఆకాశమే హద్దురా..

డిసెంబర్‌లోనూ వృద్ధి సాధించిన విశాఖ ఎయిర్‌పోర్టు



- 2023 డిసెంబర్‌తో పోలిస్తే 23 శాతం పెరిగిన స్వదేశీ ప్రయాణికులు
- డొమెస్టిక్ విమాన సర్వీసుల్లోనూ 21.22 శాతం వృద్ధి
- విదేశీ ప్రయాణికులు, సర్వీసులు ఏకంగా 115 శాతం పెరుగుదల

సాక్షి, విశాఖపట్నం : శీతాకాలం సీజన్‌లో ప్రయాణికులతో పాటు పర్యాటకుల తాకిడి పెరగడంతో విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం కళకళలాడుతోంది. విశాఖ నుంచి రాకపోకలు సాగించే వారి సంఖ్య ఊపందుకుంది. 2023 డిసెంబర్‌తో పోలిస్తే.. 2024 డిసెంబర్ నెలలో దేశ, విదేశీ ప్రయాణికుల రాకపోకలతో పాటు విమాన సర్వీసుల్లోనూ గణనీయంగా వృద్ధి సాధించింది.

వింటర్ సర్వీసులు పెరగడంతో..

చలికాలం అంటేనే పర్యాటకులకు పండగ. అందుకే విభిన్న మార్గాల్లో విమానయానాన్ని అందుబాటులోకి తీసుకొస్తూ.. ఆయా సంస్థలు తమ సర్వీసులను పెంచాయి. 2023 శీతాకాలంలో 32 సర్వీసులు ఇక్కడ నుంచి నడవగా.. ఈ ఏడాది 3 సర్వీసులు అదనంగా పెరిగాయి. మొత్తం 35 విమానాలు విశాఖ నుంచి శీతాకాలంలో రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, చెన్నై, జైపూర్, పోర్ట్‌బ్లెయిర్, కర్నూలు, కోల్‌కతా, తిరుపతి, ముంబై తదితర నగరాలకు రాకపోకలు జరుగుతున్నాయి. ఇందులో కొన్ని రోజువారి సర్వీసులుండగా.. మరి కొన్ని వారంలో మూడు రోజుల పాటు నడుస్తున్నాయి. వీటితో పాటుగా ఇంటర్నేషనల్ సర్వీసులు కూడా అదరగొడుతున్నాయి. 2023 శీతాకాలంలో విదేశాలకు ఒకే ఒక్క సర్వీసు సింగపూర్‌కు మాత్రమే ఉండేది. ఇప్పుడు మలేషియా(కౌలాలంపూర్), బ్యాంకాక్‌కు ఇంటర్నేషనల్ సర్వీసుల పెరగడం.. ఈ సర్వీసులు కూడా కళకళలాడుతుండటం కలిసొచ్చిన అంశం. ఈ వృద్ధి ఇదే తరహాలో కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. సమ్మర్ షెడ్యూల్ టైమ్‌కు మరిన్ని సర్వీసులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

డిసెంబర్‌లో ప్రయాణికులు,విమాన సర్వీసుల రాకపోకలు

దేశీయ ప్రయాణికుల రాకపోకలు		అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు	
2023 డిసెంబర్‌లో	213711	2023 డిసెంబర్‌లో	5600
2024 డిసెంబర్‌లో	263705	2024 డిసెంబర్‌లో	12042
వృద్ధి రేటు	23,39 శాతం	వృద్ధి రేటు	115.04 శాతం

దేశీయ విమాన సర్వీసుల రాకపోకలు		అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలు	
2023 డిసెంబర్‌లో	1546	2023 డిసెంబర్‌లో	38
2024 డిసెంబర్‌లో	1874	2024 డిసెంబర్‌లో	82
పెరిగిన సర్వీసులు	328	పెరిగిన సర్వీసులు	44
వృద్ధి రేటు	21.22 శాతం	వృద్ధి రేటు	115.79 శాతం

డిసెంబర్‌లో అదరగొట్టింది

డిసెంబర్ నెలలో విశాఖ ఎయిర్‌పోర్టు అదరగొట్టింది. ప్రయాణికుల రాకపోకలు, విమాన సర్వీసుల పరంగా విశాఖ ఎయిర్‌పోర్టు మంచి ఫలితాలు రాబట్టుకుంది. స్వదేశీ ప్రయాణికుల రాకపోకల్లో 2023 డిసెంబర్‌తో పోలిస్తే ఈ సారి 23.39 శాతం వృద్ధి సాధించింది. అదేవిధంగా.. డొమెస్టిక్ విమాన సర్వీసుల్లోనూ 21.22 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇక అంతర్జాతీయ పాసింజర్ల విషయంలోనూ అదే జోరు కొనసాగింది. అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో ఏకంగా 115.04 శాతం వృద్ధి నమోదవ్వగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లోనూ 115.79 శాతం నమోదైంది. గతంతో పోలిస్తే పోలిస్తే అదనంగా సర్వీసులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం.


రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం 6వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డి–1 సెక్షన్ ఏఈ త్రినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కె.వి. టౌన్–2 ఫీడర్ పరిధిలో పూడిమడక రహదారి, శారదా కాలని, నెహ్రూచౌక్, న్యూకాలనీ, రాజా థియేటర్, మెయిన్‌రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రహదారి, మున్సిపల్ కార్యాలయం రహదారి, పాత బర్మా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి

అనకాపల్లి: వృద్ధులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు అన్నారు. స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్లు అందజేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులకు నెలకు రూ. 6 వేలు పింఛన్ చెల్లించాలని కోరారు. వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు పట్టణ పరిధిలో ఒక భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరు పైడారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధులకు ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆడారి అప్పారావు, జి.సాంబవిరాజు, బుద్ధ తాతారావు, వి.సత్యనారాయణ, కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


విజయరామరాజుపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

అనకాపల్లి: విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో లో–ఓల్టేజీ సమస్యను దృష్టిలో పెట్టుకుని అదనంగా నాలుగు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ఏఈ త్రినాథ్ రావు ఆదివారం తెలిపారు. పట్టణ పరిధిలో రోజురోజుకు విద్యుత్ వినియోగదారుల సంఖ్య పెరగడంతో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడుతుందన్నారు. లోఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల ప్రజల అభిప్రాయం మేరకు కొత్తగా లక్ష్మీనారాయణ నగర్ ఫీడర్ పరిధిలో పెరుగుబజార్ జంక్షన్, ఉడ్‌పేటలో నర్సింగరావుపేట, టౌన్–1 పరిధిలో విజయరామరాజుపేట, టౌన్–2 పరిధిలో పూడిమడక రహదారిలో కొత్తగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్తిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవెన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 202 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

- సాధారణం కన్నా అధిక వరి దిగుబడి
- పూర్తయిన పంట కోత ప్రయోగం
- ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం)లో పంట పుష్కలం


ఆరుగాలం కష్టం.. అద్భుతమైన ఫలితం

మండలంలో వ్యవసాయ శాఖ, గణాంకాల విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు విజయవంతంగా ముగిసాయి. ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం)లో సాధారణం కన్నా అధిక దిగుబడి వచ్చింది. మొత్తం 34 ప్రయోగాలు చేశారు. మండలంలో ఈ ఏడాది 1360 హెక్టార్లలో ఖరీఫ్ వరి వేశారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఆరుగాలం పడిన కష్టానికి అద్భుత ఫలితం దక్కింది. కన్నూరుపాలెం రైతు చక్కటి దిగుబడి సాధించారు.


పంట కోత ప్రయోగానికి ఎంపిక చేసిన ప్రాంతం


ఈ.చౌడువాడలో ఎక్కువగా పండిన వరి పొలం నుంచి ధాన్యం సేకరిస్తున్న రైతులు

కశింకోట: మండల వ్యవసాయ అధికారులు, సహాయ గణాంకాల అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ సహాయకులు బృందంగా ఏర్పడి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. గుర్తించిన మడిలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో చతురస్రాకార ప్రాంతంలో పండిన పొలాన్ని కోసి పనలను దులిపి ధాన్యాన్ని సేకరించారు. వాటిని తూనిక వేశారు. ఎంత మేర దిగుబడి వచ్చిందన్న విషయమై లెక్క కట్టారు. దీన్ని అనుసరించి ఎకరానికి వచ్చే దిగుబడిని లెక్క కడతారు. ఇలా ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం), కశింకోట, ఉగ్గినపాలెం, తేగాడ, బయ్యవరం, వెదురుపర్తి, గొబ్బూరు, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, సుందరయ్యపేట, నరసింగబిల్లి, అచ్చెర్ల, జి.భీమవరం, అడ్డాం, చెరకాం తదితర గ్రామాల్లో ప్రయోగాలు నిర్వహించారు. వీటిలో అత్యధికంగా కన్నూరుపాలెంలో గెద్దం నాగభూషణంకు చెందిన పొలంలో 18.90 కిలోల దిగుబడి వచ్చింది. సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 18 కిలోల దిగుబడి రావాలి. అంతకు మించి దిగుబడి వచ్చింది. మిగిలిన చోట్ల కూడా దిగుబడులు దాదాపు ఆశాజకంగానే ఉన్నాయని, కశింకోటలో తక్కువ వచ్చినట్లు వ్యవసాయ అధికారులంటున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు.


బయ్యవరంలో పండిన వరి పంట


ఏనుగుతునిలో తూకం వేస్తున్న ధాన్యం

వరి పంటతోనే ఆదాయం



ఈ ఏడాది ఎకరం భూమిలో వరి పంట వేశాను. పంట కోత ప్రయోగంలో 11.56 కిలోల దిగుబడి వచ్చింది. చాలా కాలంగా వ్యవసాయం చేస్తూ వరి పండిస్తున్నాను. ధాన్యాన్ని ఇంటి అవసరాలకు, మిగిలినవి మార్కెట్‌లో విక్రయించి ఆదాయం పొందుతున్నాం.

– మారిశెట్టి నూకరాజు, వరి రైతు, ఏనుగుతుని.

పంట కోత ప్రయోగాలు పూర్తి..

మండలంలో 34 పంట కోత ప్రయోగాలు నిర్వహించాం. గణాంకాల శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రయోగాలు పూర్తి చేశాం. గణాంకాల శాఖ ద్వారా వచ్చిన భూముల్లో పండిన వరి పంటలను 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పులో చతురస్రాకారంలో పండిన వరి పంట నుంచి ధాన్యం సేకరించి దిగుబడిని లెక్క కట్టాం. ఈ.చౌడువాడలో అత్యధికంగా దిగుబడి వచ్చింది. కశింకోటలో తక్కువగా వచ్చింది. ప్రయోగాలు పూర్తి అయ్యాయి.

– ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం చేస్తున్న దాతలు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో సన్ని యూత్ క్లబ్ భవనంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 50 మంది యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. విశాఖలోని ఛత్రపతి శివాజీ వాలంటరీ బ్లడ్ బ్యాంక్ నుంచి వైద్య, ఆరోగ్య సిబ్బంది వచ్చి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి డీసీసీబీ మేనేజర్ లంక దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ముగ్గురి ప్రాణాలు కాపాడటమే కాకుండా అనేక వ్యాధుల నుంచి కాపాడుతుందన్నారు. యూత్ ఆధ్వర్యంలో 8 ఏళ్లుగా రక్త దాన శిబిరం నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి జయ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిదిరెడ్డి ప్రసాద్, జనసేన గ్రామ అధ్యక్షుడు బలిజ చంటి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కోరుప్రోలు వెంకటేశ్వరరావు, ఆదర్శ స్కూలు కరస్పాండెంట్ దేవర చిరంజీవి, విశ్వ భారతి కాలేజ్ కరస్పాండెంట్ గొన్నాబత్తుల నానాజీ, సన్ని యూత్ క్లబ్ అధ్యక్షుడు అగ్గాల శ్రీను, మండల కాంగ్రెస్ నాయకుడు సన్నేడ గజ్జాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నేటికీ అందని జీతాలు


అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ఉపాధ్యాయులకు 1వ తేదీనే జీతాలు వేస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది జూన్‌లో మాత్రమే 1వ తేదీన జీతాలు వేశారని, తర్వాతి నెల నుంచి జీతాలు సరిగ్గా వేయడం లేదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీతాలు లేక ఉపాధ్యాయులు ఈఎంఐలు, కరెంట్ బిల్లులు చెల్లించలేకపోతున్నారని అన్నారు. అపరాధ రుసుంతో చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పిల్లల ఫీజులు కట్టేందుకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని ఆయన కోరారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎన్ఆర్ఐ నవీన్, అల్లాడ సురేష్

నర్సీపట్నం : నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో క్రీడా పోటీలు రసవత్తరంగా జరిగాయి. క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్‌లో భాగంగా వాలీబాల్, బాక్సింగ్, షాట్‌పుట్, వుషూ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ప్రథమ బహుమతి స్టేడియం క్రీడాకారులు సాధించారు. షాట్‌పుట్‌లో పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కోస్ కాలేజీకి చెందిన శశికుమార్, మహిళా విభాగంలో రిషి కాలేజీకి చెందిన కె.జాహ్నవి గెలుపొందారు. బాక్సింగ్‌లో కుంచా మోక్షిత్, ప్రవీణ్, బాలికల విభాగంలో గండి జ్యోతి, లాస్య గెలుపొందారు. వుషూ పోటీల్లో పెదబొడ్డేపల్లి నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ వుషూ క్రీడాకారులు గెలుపొందారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎన్ఆర్ఐ నవీన్, డైరెక్టర్స్ సుతాపల్లి శ్రావణ్, సుతాపల్లి శ్రీకాంత్, అల్లాడి సురేష్ గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను సీనియర్ కోచ్ శేఖర్, ప్రియాంక పర్యవేక్షించారు.

నిరుపయోగంగా జెండా స్తంభం


జలగల మదుం జంక్షన్‌లో నిరుపయోగంగా ఉన్న జాతీయ జెండా స్తంభం

అనకాపల్లి: జిల్లా కేంద్రంగా అనకాపల్లి ఏర్పడిన తర్వాత జాతీయ రహదారి జలగల మదుం జంక్షన్ వద్ద మాజీ ఎంపీ బీవీ సత్యవతి సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను అప్పటి కలెక్టర్ రవిపటాన్‌శెట్టి, సత్యవతి ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ జెండా ఊసే మరిచిపోయారు. మొన్నటి ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అక్కడ జాతీయ పతాకావిష్కరణ జరగలేదు. రానున్న 26 గణతంత్ర దినోత్సవానికైనా పతాకావిష్కరణ జరగాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం జెండా స్తంభం నిరుపయోగంగా మారిందని, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి జాతీయ జెండాను ఆవిష్కరించాలని కోరుతున్నారు.

160 ఎకరాల్లో వేరుశనగ సాగు


చిరికివానిపాలెంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు సాగు చేపడుతున్న వేరుశనగ పంట సాగుకు ఇటీవల కాలంలో వర్షాలు మేలు చేకూర్చాయి. రబీ సాగులో భాగంగా డిసెంబర్ రెండో వారం నుంచి వేరుశనగ పంట సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం అల్పపీడన ప్రభావం కారణంగా కురిసిన తేలికపాటి వర్షాలు వేరుశనగ పంటకు మేలు చేశాయి. వేరుశెనగ నాట్లు వేసిన పొలాల్లో పంట ప్రస్తుతం పచ్చగా కళకళలాడుతోంది. కొరువాడ, పోతనవలస, వారాడ, చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, కొత్త అగ్రహారం గ్రామాల్లో 160 ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో వేరుశనగ పంట సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడి సాధించగలమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దంతాల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు


పెన్షనర్లకు దంతాల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు సింహాద్రినాయుడు

దేవరాపల్లి : దంతాల ఆరోగ్యంపై అశ్రద్ధ చేయొద్దని యలమంచిలి విజ్ఞు దంత వైద్యశాల వైద్య నిపుణుడు పి. సింహాద్రినాయుడు సూచించారు. కాశీపురం హైస్కూల్‌లో పెన్షనర్స్ అసోసియేషన్ (రిటైర్డ్ ఉద్యోగులు) సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి చిన కన్నబాబు, సెక్రటరీ ఆదిరెడ్డి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యుల యోగ క్షేమాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింహాద్రినాయుడు మాట్లాడుతూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వాటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు.

7, 8 తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

అనకాపల్లి: విద్యుత్ శాఖలో ఆర్థిక సంవత్సరానికి డిస్కంలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయం అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడలోను, 10న కర్నూలులో జరుగుతుందని, స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగదారులతో వర్చువల్ పద్ధతిలో మాట్లాడేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఆ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 10.30 నుంచి 1 గంట వరకూ వ్యక్తిగతంగాను, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతుందన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడవచ్చని ఆయన చెప్పారు. కాన్ఫరెన్స్‌లో మాట్లాడే వారు ముందుగా డీఈ, సర్కిల్ కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు


కె.వెంకటాపురంలో మేలుకొలుపు పాడుతున్న భక్తులు

కోటవురట్ల: మేలుకొలుపుతో పల్లెలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. వేకువజామునే మేలుకొలుపు చేసి భక్తిని చాటుకుంటున్నారు. కె.వెంకటాపురంలో ఆదివారం తెల్లవారుజామున మేలుకొలుపు పాడారు. రామాలయం నుంచి వీధుల్లో తిరుగుతూ సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పిల్లలు సైతం చలిని కూడా లెక్క చేయకుండా మేలుకొలుపులో పాల్గొని సంకీర్తన చేశారు.

సంక్షేమ బోర్డుతోనే కార్మికులకు మేలు


మాట్లాడుతున్న లక్ష్మయ్య

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రోడ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు, కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆల్ ఇండియా రోడ్ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. డీజిల్ రేట్ల పెంపుదల వల్ల రవాణా రంగ కార్మికులు ఆదాయం కోల్పోయారన్నారు. ఏడాదికి రూ.7 లక్షల వరకు ఒక్కో కార్మికుడి నుంచి ప్రభుత్వాలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తున్న వారికి సంక్షేమ బోర్డు ద్వారా సహకారం అందించాలని కోరారు. కేరళ రాష్ట్రంలా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రభుత్వాలే నిర్వహించాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ అద్దె బస్సుల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర నాయకుడు వి.తులసీరామ్ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న హైర్‌బస్ డ్రైవర్లకు అత్యల్ప జీతాలు ఇచ్చి ఇటు ప్రభుత్వం, అటు ఓనర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా జి.దేముడిని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మరో 15 మంది జిల్లా కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఆర్టీసీ హైర్‌బస్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏపీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఎస్‌వీ పరమేశ్వరరావు, నాయకులు వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే బీసీ కులాల అభివృద్ధి


మాట్లాడుతున్న అంగడాల పూర్ణచంద్రరావు

అనకాపల్లి: కుల గణన ద్వారానే బీసీల అభివృద్ధి జరుగుతుందని బీసీ కులాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం బీసీ కులాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా పొందుతున్న రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో బీసీలకు దక్కాలంటే బీసీ కులాల విభజన జరగాలని కోరారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో బీసీ కులాలు తీవ్రంగా వెనుకబాటుకు గురవుతున్నాయని, బీసీలంతా ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.సి.రమణ మాట్లాడుతూ బీసీలు తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కో–కన్వీనర్ కె.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే బీసీలు పూర్తిగా వెనుకబడిపోయారని, రాజకీయంగా బీసీలకు దక్కవలసినవి దక్కలేదన్నారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, గుడాల సత్యనారాయణ, బొట్టా చిన్నయాదవ్, కోన లక్ష్మణ్, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బొబ్బిలి గోవిందరావు, వాసుపల్లి తాతయ్యలు, ఎస్.వి.వి.రామచంద్రరావు, సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు

- 80 ఏళ్ల పూర్వ విద్యార్థులకు సత్కారం
- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ


సమావేశమైన గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూలు పూర్వ విద్యార్థులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏడాది పూర్వ విద్యార్థులు జనవరిలో ఆత్మీయ కలయిక నిర్వహించడం అభినందనీయమన్నారు. 50 సంవత్సరాల క్రితం నుంచి చదువుకున్న టెన్త్ విద్యార్థులు కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. విశాఖ గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ మాట్లాడుతూ హైస్కూల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు తమ శక్తి కొద్దీ ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు సహకరించాలని కోరారు. అంతకు ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, వివిధ ప్రభుత్వ శాఖల్లో పదవీ విరమణ చేసిన, 80 సంవత్సరాలు పైబడిన పూర్వ విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ప్రతినిధులు బొడ్డేడ అప్పారావు, పి.ఎస్.అప్పారావు, దాడి శివరామకృష్ణ, బల్లా నాగభూషణం, విల్లూరి అప్పల రామస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరి నూర్పిళ్లు


యండపల్లిలో వరి నూర్పు చేస్తున్న రైతు

కోటవురట్ల: ఖరీఫ్ కష్టాల నుంచి అన్నదాత తేరుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వరుస తుపానులు అన్నదాత కంటిమీద కునుకులేకుండా చేశాయి. వరి కోతలు చేపట్టే దశలో వాయుగుండం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో మండలంలో 4 వేల ఎకరాలలో వరి సాగు జరిగింది. అంతా బాగుంది ఇక కోతలు మొదలెట్టి ధాన్యపు గింజలను ఇంటికి చేర్చుకుందామనుకున్న సమయంలో వరుణుడు అనుకోని అతిథిలా పలకరించాడు. చాలా చోట్ల వరి పనలు నీట మునిగి ధాన్యం రంగు మారిపోయింది. మరికొన్ని చోట్ల పనలు నేలవాలి గింజరాలిపోయి నష్టం కలిగింది. మిగిలిన రైతులు ఉన్న గింజలను ఇంటికి తీసుకెళ్లాలన్న తపనతో జోరుగా వరి నూర్పులు చేస్తున్నారు. ప్రస్తుతం యండపల్లి, జల్లూరు, బి.కె.పల్లి, కోటవురట్ల, తంగేడు, లింగాపురం, పాములవాక తదితర ప్రాంతాలలో వరి నూర్పులు చురుగ్గా సాగుతున్నాయి. కూలీల కొరతను అధిగమించేందుకు పలువురు రైతులు నూర్పుడు యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇవి అద్దెకు దొరుకుతుండడంతో కాస్త ఖర్చు అయినా శ్రమ తగ్గుతోందని రైతులంటున్నారు. నూర్పుడు యంత్రాలను గంటకు రూ.1100 చొప్పున అద్దెకు ఇస్తున్నారు. దాంతో పలువురు రైతులు వీటిపైనే ఆసక్తి చూపిస్తున్నారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిత


విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ ఆకాంక్షించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 17 మంది విద్యార్థినులకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.70 వేల మేర ఉపాకర వేతన పంపిణీ కార్యక్రమం ఆదివారం మునగపాక హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునేందుకు సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ప్రవాస భారతీయురాలు ఆడారి పావని మూర్తి మాట్లాడుతూ చదువులో ఏకాగ్రతతో పాటు దృఢ సంకల్పం ఉండాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు శిష్టా తమ్మిరాజు, సంస్థ సభ్యులు కేవీ రమణ, ఆచంట నాగేశ్వరరావు, డి.నూకేష్, ఎస్.రమేష్, మాడెం జోగారావు, పిల్లా జగదీష్ ఏవీఎన్ మూర్తి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.